సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 20 । జనవరి । 2025



తెగుళ్లకు చెక్ పెట్టండిలా!
ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, అధిక తేమ శాతం కారణంగా అరటిలో తెగుళ్లు ఆశిస్తున్నాయి. నివారణ చర్యలు తీసుకోవాలని ఉద్యాన అధికారి సూచించారు. 8లో



శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ
ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. సంక్రాంతి సెలవులు ముగింపు రోజు కావడంతో వేలాది మంది తరలివచ్చారు. 8లో



మట్టి దందా
ద్వారకాతిరుమల మండలంలోని సత్తాల చెరువులో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. స్థానిక పచ్చ నేతలు అక్రమ దందాకు పాల్పడుతున్నారు. 8లో

న్యూస్‌రీల్

హెల్మెట్ ధారణ తప్పనిసరి



వాహనాలకు రేడియం స్టిక్కర్లు అతికిస్తున్న రవాణా శాఖ అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధారణ తప్పనిసరి అని రవాణా తనిఖీ అధికారులు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం భీమవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భీమవరం రవాణా కార్యాలయానికి చెందిన అధికారులు పాల్గొని వాహనచోదకులకు రోడ్డు భద్రత, నియమ, నిబంధనలను వివరించారు. నాలుగు చక్రాల వాహన డ్రైవర్ తప్పనిసరిగా సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, ఇన్సూ్యరెన్స్ పొల్యూషన్ రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా వెంట ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారితో మాట్లాడి వారి అనుభవాన్ని అందరికీ తెలియజేశారు. సీఎంవీ రూల్ 104 ప్రకారం వాహనం ముందు, వెనుక భాగాల్లో రేడియం స్టిక్కర్స్ లేని వాహనాలకు వాటిని అంటించారు. రవాణా తనిఖీ అధికారులు కె.ప్రసాద్, ఎం.రవికుమార్, ఎస్‌ఎల్‌ఎస్ లక్ష్మి, ఏఎస్‌పి తేజ పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

భీమవరం (ప్రకాశంచౌక్) : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పిల్లల నమోదుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు, 27 నుంచి 30 వరకు ఆరేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో మొత్తంగా 90 ఆధార్ కేంద్రాల ద్వారా క్యాంపులు నిర్వహిస్తామన్నారు. మండలాల వారీగా ఆచంటలో 2, ఆకివీడులో 4, అత్తిలిలో 3, భీమవరంలో 6, యలమంచిలిలో 4, గణపవరంలో 5, ఇరగవరంలో 3, కాళ్లలో 4, మొగల్తూరులో 4, నరసాపురంలో 3, పాలకొల్లులో 3, పాలకోడేరులో 3, పెనుగొండలో 3, పెనుమంట్రలో 3 పోడూరులో 4, తాడేపల్లిగూడెంలో 3, తణుకులో 6, ఉండిలో 3, వీరవాసరంలో 4 ఆధార్ కేంద్రాలను ఏర్పాటుచేస్తామన్నారు. అలాగే అర్బన్ మండలాల్లో భీమవరంలో 4, నరసాపురంలో 4, పాలకొల్లులో 3, తాడేపల్లిగూడెంలో 3, తణుకులో 6 ఆధార్ కేంద్రాలను ఏర్పాటుచేశామని కలెక్టర్ తెలిపారు.

విద్యుత్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ మినహాయింపు

డీటీఓ ఉమామహేశ్వరరావు



భీమవరం (ప్రకాశంచౌక్): విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను (లైఫ్ టాక్స్) మినహాయింపు ఇస్తున్నట్టు జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల నుంచి మినహాయింపు అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం విద్యుత్ వాహనాల ద్వారా కాలుష్యం తగ్గించవచ్చుని సమీక్షించి పన్ను మినహాయింపునకు నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాష్ట్రంలో కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేసుకున్న అన్ని స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నును మినహాయిస్తూ ఐదేళ్ల కాల పరిమితికి (జనవరి 2025 నుంచి జనవరి 2030 వరకు) ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పన్ను మినహాయింపు హైబ్రిడ్ వాహనాలకు వర్తించదన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ టీఆర్ జారీ చేసిన, ఆంధ్రప్రదేశ్‌లోని డీలర్లు ఇతర రాష్ట్రాలకు టీఆర్‌లు జారీచేసిన వాహనాలకు పన్ను మినహాయింపు వర్తించదని పేర్కొన్నారు.

రాట్నాలమ్మా పాహిమాం



పెదవేగి : భక్తుల పాలిట కొంగు బంగారం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో చిన్నారులకు అన్నప్రాసనలు, నామకరణలు, అక్షరాభ్యాసాలు చేయించారు. దేవస్థానానికి పూజా టికెట్లపై రూ.42,720, విరాళాల రూపంలో రూ.11,953, లడ్డూ ప్రసాదంపై రూ.21,750, ఫొటోల అమ్మకం ద్వారా రూ 3,475 మొత్తంగా రూ.79,898 ఆదాయం సమకూరిందని ఈఓ ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

పేదల గూడుకు ఎసరు

కూటమి గూడుపుఠాణి

- ఇళ్లు నిర్మించుకోని వారి స్థలాల కేటాయింపుల రద్దుకు నిర్ణయం
- వాటిని తమ మద్దతుదారులకు ఇచ్చేందుకు ప్రణాళిక
- గత ప్రభుత్వంలో జిల్లాలో 47,362 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- రద్దు కానున్నవి 4,841 పట్టాలు !
- ఆందోళనలో లబ్ధిదారులు



తణుకులోని జగనన్న కాలనీలో ఇళ్లు

సాక్షి, భీమవరం: సెంటు భూమి సేకరించి పేదలకు పంచిన దాఖలాలు లేని చంద్రబాబు సర్కారు ఇప్పుడు పాత పంథానే అనుసరిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు పొంది గృహాలు నిర్మించుకోలేని నిరుపేదల పట్టాల రద్దుకు నిర్ణయించింది. పేదలకు ఇళ్ల స్థలాలు పేరిట తిరిగి వాటిని తమ అనుచరులకు కట్టబెట్టే ఎత్తుగడ వేసింది.

గత ప్రభుత్వంలో 47 వేలకు పైగా స్థలాలు అందజేత

సొంతిళ్లు లేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో కులం, మతం, పార్టీలు చూడకుండా.. రాజకీయం చేయకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు స్థాయిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. మనుపెన్నడూ లేనివిధంగా జిల్లాలో మెరక పనులు పూర్తయిన మేర 626 లేఅవుట్లలో 47,362 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. సొంత స్థలం ఉన్న 22,757 మందికి హౌసింగ్ సాయం మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షల సాయం మంజూరుకే పరిమితం కాకుండా జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకున్నారు. పదేళ్ల తర్వాత ఇంటిపై సర్వహక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వెన్షన్ డీడ్ అందజేసే చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించి లబ్ధిదారుల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో రూ.609.46 కోట్ల వ్యయంతో 30,205 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా మిగిలినవి పునాది, రూఫ్ తదితర దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. 4,841 స్థలాల్లో ఇంకా గృహ నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు.

ఖాళీ స్థలాలపై కూటమి కన్ను: ఎన్నికల్లో ఊదరగొట్టి గద్దెనెక్కాక సూపర్ సిక్స్ వాగ్దానాలను గాలికొదిలేసి పేదలను వంచించిన కూటమి ప్రభుత్వం వారి సొంతింటి ఆశలను చిదిమేస్తోంది. ఇప్పటికే స్థలాలు పొంది ఆర్థిక ఇబ్బందులతో ఇళ్ల నిర్మాణం చేసుకోని వారి స్థలాలపై కన్నేసింది. పాత కేటాయింపులు రద్దుచేసి తమ వారికి కొత్త కేటాయింపులు చేసే పనిలో ఉంది. రెండు రోజుల క్రితం జరిగిన కేబినేట్ సమావేశంలో ఇళ్లు కట్టుకోని వారి స్థలాల రద్దుకు నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని 4,841 నిరుపేదల సొంతింటి ఆశలు ఆవిరికానున్నాయి. ఈ స్థలం ఉందన్న భరోసాతో వీరిలో పిల్లల పెళ్లిళ్లు చేసిన వారు, వైద్యం కోసం అప్పులు చేసిన వారు ఎందరో ఉన్నారు. ఇప్పుడు వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. నిరుపేదలకు ప్రభుత్వం ఇవ్వాల్సింది పోయి లాక్కోవాలని చూడటం సరికాదని కూటమి సర్కారు తీరును పలువురు విమర్శిస్తున్నారు.

ఈ ప్రభుత్వానికి పెట్టే మనసు లేదు



పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమాన్ని దివంగత వైఎస్సార్ మొదలు పెట్టారు. పదేళ్ల తర్వాత వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి మించిన తనయునిగా, దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి రూ.35 వేల కోట్లు వెచ్చించి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించారు. ఇప్పుడు పేదలకు ఇచ్చిన స్థలాలను కూటమి ప్రభుత్వం లాక్కోవాలని చూడటం దుర్మార్గం. పేదలకు ఇచ్చేటటువంటి మనస్తత్వం లేదు.. ఇవ్వాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. పేదవర్గాల వారికి ఎప్పుడూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.

-ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



పేదలకు అండగా ఉండి వారి సొంతింటి కలను సాకారం చేయాల్సింది పోయి గతంలో పంపిణీ చేసిన స్థలాలను ప్రభుత్వం తిరిగి లాక్కోవాలనుకోవడం సరికాదు. స్థలం ఉందన్న భరోసాతో తమ పిల్లల పెళ్లిళ్లు చేసిన వారు ఎంతోమంది ఉన్నారు.

- ఝాన్సీ లారెన్స్, తణుకు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో మంజూరు చేసిన ఇళ్లు

మండలం	స్థలాల మంజూరు	నిర్మాణాలు మొదలుకానివి
కాళ్ల	360	2
పాలకొల్లు	1,037	13
తాడేపల్లిగూడెం	4,402	176
మొగల్తూరు	669	30
భీమవరం	7,453	3,983
యలమంచిలి	754	63
గణపవరం	769	18
పెంటపాడు	1,357	14
ఇరగవరం	1,281	29
వీరవాసరం	871	57
ఆచంట	1,311	17
పోడూరు	1,866	13
పెనుమంట్ర	272	12
ఉండి	1,721	36
అత్తిలి	1,590	116
పెనుగొండ	2,080	33
పాలకోడేరు	1,782	8
తణుకు	9,068	28
నరసాపురం	3,753	81
ఆకివీడు	2,966	112

కబడ్డీ చాంప్స్ మహారాష్ట్ర, ఢిల్లీ



మహిళల విజేత సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ జట్టుకు నగదు, షీల్డ్ అందిస్తున్న దృశ్యం

ముగిసిన జాతీయస్థాయి కబడ్డీ పోటీలు



పురుషుల విజేత మహారాష్ట్ర జట్టు

నరసాపురం: నరసాపురం రుస్తుంబాదలో జరుగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పురుషుల విభాగంలో మహారాష్ట్ర జట్టు, మహిళల విభాగంలో సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ జట్టు చాంపియన్‌షిప్స్ సాధించాయి. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోటీలు ముగిశాయి. పురుషుల విభాగంలో రన్నరప్‌గా కోల్‌కతా పోలీస్ జట్టు నిలిచింది. 3, 4 స్థానాల్లో సీఆర్‌ఎఫ్ ఢిల్లీ, కోల్‌కతా జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో రాజస్థాన్ జట్టు రన్నరప్‌గా నిలిచి రెండో స్థానం దక్కించుకోగా కోల్‌కతా, కేరళ జట్లు 3,4 స్థానాలను దక్కించుకున్నాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో కలెక్టర్ సీహెచ్ నాగరాణి, జిల్లా ఎస్పీ నయాం అస్మి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. పురుషుల విభాగంలో మొదటి బహుమతి రూ.1.50 లక్షలు, రెండో బహుమతి రూ.లక్ష, మూడో బహుమతి రూ.75 వేలు, నాల్గో బహుమతి రూ.50 వేలు షీల్డ్స్ అందించారు. మహిళ విభాగంలో విజేతలకూ ఇలానే బహుమతులు అందించారు. మొత్తంగా రూ.7.50 లక్షల నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయాం అస్మి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలు సంస్కృతిలో భాగమన్నారు. యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. నరసాపురంలో 32 ఏళ్ల నుంచి జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినంధనీయమన్నారు. మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, పోటీల కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ జి.శ్రీవేద తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలతోనే ఆక్వా వ్యాపారి కిడ్నాప్

- పోలీసుల అదుపులో కిడ్నాప్ ముఠా
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జయసూర్య



కిడ్నాప్‌నకు గురైన విశ్వనాథుని వెంకట సత్యనారాయణ



భీమవరంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం: అతనొక వడ్డీ వ్యాపారి. తెలిసిన వారి వద్ద తక్కువ వడ్డీకి పెద్ద మొత్తంలో సొమ్ములు తీసుకుని ఇతరులకు ఎక్కువ వడ్డీకి ఇస్తుంటారు. అలాగే ఆక్వా వ్యాపారం చేస్తుంటారు. ఇలా సుమారు రూ.40 కోట్ల వరకు అప్పులు చేశారు. తిరిగి చెల్లించకపోవడంతో అప్పులిచ్చిన కొందరు సినీ పక్కీలో ఆయన్ను కిడ్నాప్ చేసి ఆస్తులు రాయించుకోవాలని చేసిన ప్రణాళిక బెడిసి కొట్టి చివరకు పోలీసులకు చిక్కారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య విలేకరులకు వివరాలు వెల్లడించారు.

అనంతపురం ముఠాతో ఒప్పందం

భీమవరానికి చెందిన విశ్వనాథుని వెంకట నారాయణ (నాని) పట్టణానికే చెందిన సోమిశెట్టి ఆర్‌కే సత్యప్రసాద్, ఇన్నమూరి లక్ష్మీవెంకట మల్లికార్జున సురేష్‌బాబు వారి బంధుల వద్ద కరోనా విపత్తు సయమంలో అప్పు తీసుకున్నారు. సకాలంలో చెల్లించకపోవడంతో 2021లో వడ్డీతో సహా రూ.10.70 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. అప్పటి నుంచి సొమ్ము చెల్లించాలని నానిపై ఒత్తిడి చేసినా ఫలితం లేదు. దీంతో నానిని కిడ్నాప్ చేయాలని సత్యప్రసాద్, సురేష్‌బాబు పథకం రచించారు. సత్యప్రసాద్ అనంతపురంలోని ముదిగుబ్బ ప్రాంతానికి చెందిన కాకతీయ రెస్టారెంట్ యజమాని ఆశిష్‌ను సంప్రదించారు. తమకు రావాల్సిన మొత్తంలో 10 శాతం కిరాయిగా ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. దీంతో ఆశిష్ తనకు తెలిసిన లోకేష్‌ను సంప్రదించాడు. వీరిద్దరూ అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముంతిమగుడు గ్రామానికి చెందిన అరవ భగవాన్ (యోహాన్), గుత్తి మండలం ఎంగిలిబండకి చెందిన బాల నాగేంద్రబాబు, తొండపాడుకి చెందిన మునగాల హరికృష్ణ, నల్లమాడు మండలం రాగానిపల్లి తండాకి చెందిన బుక్కే దివాకర్ నాయక్, రుధం మండలం చోలే మర్రికి చెందిన బోయే రాము, కడపలోని సంకరాపురం ప్రాంతానికి చెందిన మేఘావత్ చరణ్, రాజేష్, గోవర్ధన్‌లను ముఠాగా చేసి నానిని కిడ్నాప్ చేసేందుకు ఈనెల 16న అంతా సిద్ధం చేశారు.

పక్కాగా రెక్కీ చేసి.. పోలీసులమని కారులోకి ఎక్కించి..

పథకంలో భాగంగా ముందుగా సత్యనారాయణ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళుతున్న సత్యనారాయణను మరో కారులో వెంబడించారు. సత్యనారాయణ కుటుంబసభ్యులు రైల్వేస్టేషన్ లోపలికి వెళ్లగా కారు వద్ద ఉన్న సత్యనారాయణను పోలీసులమని చెప్పి బలవంతంగా వీరి కారులో ఎక్కించుకుని అనంతపురం తీసుకువెళ్లారు. సత్యనారాయణ తన ఆస్తులు అమ్మి డబ్బు చెల్లిస్తానని చెప్పడంతో అక్కడి నుంచి ఈనెల 18న తిరిగి భీమవరం తీసుకురావడంతో.. గరగపర్రు రోడ్డులో ఉన్న సురేష్‌బాబు, ముఠాలోని అరవ భగవాన్, బాల నాగేంద్రబాబు, బుక్కే దివాకర్‌నాయక్, మునగాల హరికృష్ణ, బోయే రాము, మేఘావత్ చరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి మూడు కార్లు, 9 సెల్‌ఫోన్లు, ఒక డైరీ, వాకీటాకీ, చాకు, మూడు క్రికెట్ వికెట్స్, రెండు హాకీ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ జయసూర్య చెప్పారు. నిందితుల్లో సోమిశెట్టి ఆర్‌కే సత్యప్రసాద్, ఆశీష్, లోకేష్, రాజేష్, గోవర్ధన్ పరారీలో ఉన్నారని డీఎస్పీ వివరించారు. కేసును గంటల వ్యవధిలో ఛేదించిన టుటౌన్ సీఐ జి.కాళీచరణ్, ఎస్సై ఫజుల్ రహమాన్, ఇజ్రాయేలు, ఎస్.గోపి, టి.ముత్యాలరాజులను డీఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



భీమవరంలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

భీమవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా భీమవరంలో ఆదివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమిత్‌షా గో బ్యాక్ అనే నినాదంతో సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాకు రాష్ట్రంలో అడుగు పెట్టే అర్హత లేదన్నారు. అంబేడ్కర్ గురించి హేళన చేసి మాట్లాడం దుర్మార్గమన్నారు. అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, పార్లమెంట్ సాక్షిగా ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడవడానికి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, ఏపీ బహుజన జేఏసీ నాయకుడు బిరుదుగడ్డ రమేష్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, బాతిరెడ్డి జార్జి, పుల్లారెడ్డి, మల్లిలపూడి రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

త్యాగాలకు వెనుకాడని సైనికులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశ రక్షణలో ఎలాంటి త్యాగాలకైనా సైనికులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని జెడ్‌ఎస్‌డబ్ల్యూ కేవీఎస్ ప్రసాదరావు అన్నారు. ఏలూరు జిల్లా మాజీ సైనిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోటదిబ్బ వద్ద భారత పదాతిదళ దినోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రసాదరావు మాట్లాడుతూ శత్రువుల వ్యూహాలను తిప్పికొడుతూ దేశ రక్షణలో ఎందరో సైనికులు వీరమరణం పొందుతున్నారన్నారు. మాజీ సైనిక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మాజీ సైనికులు, వీర నారీమణుల పింఛన్ సమస్యల పరిష్కారినికి, లైఫ్ సర్టిఫికెట్ నమోదుకు తమ సంఘం కృషి చేస్తోందన్నారు. తొలుత అమర జవాన్ స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 80 ఏళ్లు పైబడిన పలువురు మాజీ సైనికులను సన్మానించారు. సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేతినేని భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బింబార్కర్ రమేష్, ఉపాధ్యక్షుడు శ్యామ్‌గణేష్, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కలెక్టర్ తనిఖీలు

సాక్షి స్పందన



ఏలూరు జీజీహెచ్‌లో డ్రెయినేజీ వ్యవస్థపై ఆరా తీస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో క్షీణించిన పారిశుద్ధ్యంపై ఆదివారం 'సాక్షి'లో 'జీజీహెచ్‌లో పారిశుద్ధ్యం అధ్వానం' శీర్షికన ప్రచురించిన కథనానికి ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించారు. మధ్యాహ్నం జీజీహెచ్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, ఏలూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, బోధనాస్పత్రి ఇంజనీరింగ్ అధికారులను వెంట బెట్టుకుని జీజీహెచ్ ప్రాంగణంలో డ్రెయినేజీ పరిస్థితులపై చర్చించారు. ఆస్పత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్ భవనం ప్రవేశ మార్గం వద్ద వీల్‌చైర్స్ కోసం ర్యాంపు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అలాగే మురుగునీరు పారుదల సక్రమంగా సాగేలా చర్యలు చేపట్టాలని, పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాస్పత్రి మ్యాప్‌ను సైతం ఆమె పరిశీలించి పనులకు సూచనలు ఇచ్చారు. అత్యవసర పనుల ప్రాతిపదికన అంచనాల ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య పరిస్థితులను రోజూ పర్యవేక్షించాలనీ లేకుంటే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, కార్పొరేషన్ ఈఈ జి.సురేంద్రబాబు, తహసీల్దార్ జీవీ శేషగిరి ఆమె వెంట ఉన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఆదివారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. సంక్రాంతి సెలవులు ముగింపు రోజు కావడంతో వేలాది మంది భక్తులు శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు. దాంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పు రాజగోపుర ప్రాంతం, కల్యాణ కట్ట ఇలా అన్ని విభాగాలు భక్తులతో పోటెత్తాయి. అనివేటి మండపంలో పలు కోలాట భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వేల సంఖ్యలో భక్తులు స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం వరకు క్షేత్రంలో రద్దీ కొనసాగింది.

గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు



మంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలోని కావవరం సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుడికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలి వచ్చి మంగమ్మతల్లిని దర్శించుకుని దూప, దీప నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో భక్తులు తరలి వచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పాటమ్మతల్లిని, పసుపులమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెలించుకున్నారు. మంగమ్మ తల్లి దర్శనానికి వచ్చిన భక్తుల్లో అనేక మంది జల్లేరు జలాశయంను కూడా సందర్శంచి సెల్ఫీ ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

పక్షుల కేంద్రం వద్ద సందడి



పక్షుల విశేషాలు వివరిస్తున్న డీఆర్వో

కైకలూరు: సంక్రాంతి సెలవుల ముగింపు నేపథ్యంలో ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. ఏలూరు, కృష్ణ, పశ్చిమగోదావరి ప్రాంతాల నుంచి ఎక్కువగా యాత్రికులు వచ్చారు. బోటు షికారు చేస్తూ దగ్గరుండి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల కేరింతలను ఆస్వాదించారు. సమీప చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడుకున్నారు. పక్షి నమూనా మ్యూజియంను సందర్శించారు. అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ రంజిత్‌కుమార్ కొల్లేరు పక్షుల విశేషాలను పర్యాటకులకు వివరించారు.

సత్తాల చెరువులో మట్టి దందా

పచ్చ నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా తవ్వకాలు



సత్తాల చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీ



చెరువులో ఏర్పడిన గుంత

ద్వారకాతిరుమల: మండలంలోని సత్తాల చెరువులో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. అడ్డూ అదుపూ లేకపోవడంతో.. రాత్రి, పగలు తేడా లేకుండా స్థానిక పచ్చ నేతలు కొందరు ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. యథేచ్ఛగా మట్టిని అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. 32 ఎకరాలకు పైగా ఉన్న సత్తాల చెరువులో గత కొద్ది రోజులుగా మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక టీడీపీ నాయకులు కొందరు భీమడోలు, కొల్లేరు, కైకలూరు, భీమవరం తదితర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్ల చదునుకు మట్టిని తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి టిప్పర్ మట్టిని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. చెరువులో పెద్ద పెద్ద గుంతలు పెడుతున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న మట్టి అక్రమ రవాణా కారణంగా రహదారులు సైతం ధ్వంసం అవుతున్నాయని అంటున్నారు. ఇష్టానుసారం మట్టి తవ్వకాలు జరుపుతుంటే, సంబంధిత అధికారులు మిన్నకుండిపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మట్టి అక్రమ దందా గూర్చి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామ సర్పంచ్ కొండాబత్తుల సుభద్ర తెలిపారు. అధికార పార్టీ నేతలు కావడంతో ఆవైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ఆమె కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన చేపల కనకమహాలక్ష్మీ భర్తతో విడిపోయి గత కొంతకాలంగా తల్లివద్దనే ఉంటోంది. సంక్రాంతి సమయంలో తనకు బట్టలు కొనలేదని తల్లితో గొడవ పడింది. దీంతో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటి నుంచి వెళ్ళిపోయింది. ఆమె ఆచూకీ కోసం ఎంత వెదికినా లభించకపోవడంతో ఆదివారం తల్లి ఫిర్యాదుపై ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరంలో శనివారం అర్ధరాత్రి ఒక వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ మద్యం సేవించి అల్లరి చేసఉతన్న వారిపై లక్కవరం పోలీసులు దాడి చేశారు. జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు, లక్కవరం ఎస్సై శశాంక తమ సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. వీరి నుంచి 23 తెలంగాణ మద్యం బాటిళ్లు, ఐదు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

ముగిసిన గొలుసుల పంజా ఉరుసు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం ప్రముఖులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కుండీ సెంటర్‌లోని హజరత్ మౌలా అలీ ముష్కిల్ కుష మహాత్ముడి ఆస్థాన(గొలుసుల పంజా) ఉరుసు మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం దివ్య ఖురాన్ గ్రంథపారాయణం చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం పంజాలో అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహాత్ముడి అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని మహాత్ముడి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో గొలుసుల పంజా వంశపారంపర్య ముజావర్లు ఎండీ వజీర్ అలీ, ఎండీ గాలబ్ అలీ, ఎండీ మౌలా అలీ, ఎండీ ఖాదర్ అలీ,, ఎండీ నాసర్ అలీ, ఎండీ మున్వర్ అలీ, ఎండీ షాహిద్ అలీ పాల్గొన్నారు.

అరటిలో తెగుళ్లకు చెక్ పెట్టండిలా!

పాడి - పంట



తెగులు సోకి రంగుమారిన అరటి చెట్టు

చింతలపూడి: ఏలూరు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాలో సుమారు 12,076 హెక్టార్లలో అరటి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, అధిక తేమ శాతం కారణంగా అరటిలో ఆకుమచ్చ తెగుళ్లు, దుంప కుళ్లు తెగుళ్లు ఆశిస్తున్నాయి. సాధారణంగా వాతావరణంలో 26 నుంచి 32 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు, 70 నుంచి 75 శాతం తేమ ఉన్నప్పుడు సిగటోక ఆకుమచ్చ తెగులు, పనామా దుంపకుళ్లు తెగులు, బ్యాక్టీరియా దుంపకుళ్లు తెగులు ఆశించే అవకాశాలు ఎక్కువ. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చింతలపూడి ఉద్యాన శాఖాధికారి ఎండీ షాఫియా ఫర్వీన్ రైతులకు పలు సూచనలు చేశారు.

సిగటోక ఆకు మచ్చ తెగులు

ఈ తెగులు వర్షాకాలం, చలి కాలాల్లో ఎక్కువగ వచ్చే అవకాశం ఉంది. తెల్ల చక్రకేళి, పచ్చ అరటి, బొంతలో ఎక్కువగా ఆశిస్తుంది. ముందుగా కింది ఆకులపై చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ పెరిగి మధ్యలో బూడిద రంగు కలిగి ఉంటాయి. ఈ మచ్చలు గోధుమ రంగులోకి మారి పరిమాణంలో పెద్దవై ఒకదానితో ఒకటి కలిసిపోయి ఆకు మొత్తం ఎండిపోతుంది.

నివారణ: నెల వ్యవధిలో 4-5 సార్లు పిచికారి చేసుకున్నప్పుడు తెగులు ఉధృతి అరికట్టవచ్చు. తెగులు మందులు కూడా మార్పిడి చేస్తూ పిచికారి చేయాలి. మొదటి పిచికారీ ప్రోపికొనజోల్ 1 మీ.లి. లీటర్ నీటికి, రెండో పిచికారీ కార్బెండిజమ్, మాకోజెబ్ మిశ్రమాన్ని 1 గ్రాము లీటర్ నీటికి, మూడో సారి ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్, టేబుకొనజోల్ మిశ్రమాన్ని 1.5 గ్రాము లీటర్ నీటికి, నాలుగో పిచికారీ డయఫెనకొనజోల్ 1 మీ. లి. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పనామా దుంప కుళ్లు తెగులు

ఈ తెగులు వల్ల కింది ఆకులు పసుపు బారి ఎండిపోయి వాలిపోతాయి.

నివారణ: తెగులు రహిత తోటల నుంచి మాత్రమే పిలకలు ఎంపిక చేసుకోవాలి. పిలకలను సుడోమొనస్ లేదా మాంకోజెబ్ లేదా కార్బెండిజమ్ ద్రావణంతో శుద్ధి చేసుకోవాలి. తెగులు ఎక్కువగా ఉన్న తోటలలో వరి వంటి వాటితో పంట మార్పిడి చేసుకోవాలి.

బ్యాక్టీరియా దుంప కుళ్ళు తెగులు

చక్రకేళిలో ఎక్కువగా ఆశిస్తోంది. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు చిన్న మొక్కలకు నీటి తడులు ఇచ్చినప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. కాండంపై(డొప్పలపై) కుళ్ళు మచ్చలు ఏర్పడి క్రమేపీ దుంప కుళ్ళిపోయి వాసన వస్తుంది. ఆకులు పసుపు రంగులోకి మారి బొందపై పగుళ్లు ఏర్పడి చిన్నపాటి గాలులకే చెట్టు/మొక్క పడిపోతుంది.

నివారణ: ప్రాథమిక దశలో బ్లీచింగ్ పౌడర్ 25 గ్రా లీటర్ నీటికి కలిపి మొదలు తడిచేలా పోయాలి. ఎక్కువగా ఉన్నప్పుడు కాపర్ అక్సీక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ 3 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలపి మొదలు తడిచేలా పోయాలి.

భక్తుల నుంచి డబ్బులు డిమాండ్



కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు(ఫైల్)



భక్తుడు ఫిర్యాదు చేసిన ఇద్దరిలో ఒక వ్యక్తి (వృత్తంలో)

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ ఆవరణలోని కొబ్బరికాయలు కొట్టే ప్రాంతంలో ఇద్దరు మందు బాబులు ఆదివారం వీరంగం సృష్టించారు. డబ్బులు ఇవ్వని భక్తులను నోటికొచ్చినట్టు తిట్టారు. చివరకు ఒక భక్తుడి ఫిర్యాదుతో వారిద్దరిని దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పోలీస్టేషన్‌లో అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నను నిత్యం వేలాది మంది భక్తులు దర్శిస్తున్నారు. దర్శనానంతరం వారు శ్రీహరి కళాతోరణ వేదిక పక్కనున్న ప్రాంతంలో కొబ్బరి కాయలు కొడతారు. అక్కడ కొబ్బరి ముక్కలను కాంట్రాక్టుదారుడి తరఫు సిబ్బంది పోగు చేసుకుంటున్నారు. కొబ్బరి కాయలు కొట్టే భక్తులను ఒకరిద్దరు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు కొన్నాళ్లుగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం మద్యం పూటుగా సేవించిన ఇద్దరు వ్యక్తులు కొబ్బరి కాయలు కొట్టే భక్తులను రూ.10 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వని వారిని నోటికొచ్చినట్టు తిట్టారు. దీనిపై పిప్పరకు చెందిన ఒక భక్తుడు దేవస్థానం సెక్యూరిటీ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దాంతో ఆ ఇద్దరు మందు బాబులను సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

కలుషిత నీరు తాగి ఏడు పశువుల మృతి



కొయ్యలగూడెం మండలం రాజవరంలో కలుషిత నీరు తాగి మృతి చెందిన ఆవులు

కొయ్యలగూడెం: కలుషిత నీరు తాగి ఏడు పశువులు మృతి చెందిన ఘటన రాజవరం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాధిత రైతు వట్టిబోలు సాయిబాబు వివరాల ప్రకారం కలుషిత నీరు తాగడంతో మూడు గేదెలు, రెండు ఆవులు, ఒక ఆవు దూడ, ఒక గేదె దూడ ప్రాణాలు కోల్పోయాయని వాపోయాడు. గ్రామ సమీపంలోని వర్జీనియా బేరన్ తోటకు ఉపయోగించగా మిగిలిన యూరియా నీరును పంటబోదెలో పారబోశాడు. ప్రతిరోజు సాయిబాబాకి చెందిన పశువులు అదే ప్రాంతంలో దాహార్తి కోసం వెళ్లి నీరు తాగుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో యూరియా కలిపిన కలుషిత నీరును పశువులు తాగడంతో మృత్యువాత పడ్డాయి. కొన్ని పశువులు కొనఊపిరితో పోరాడుతుండగా పశు వైద్య శాఖ అధికారులు హుటాహుటిన వెళ్లి చేసిన వైద్య సేవలందించినా ఫలితం లేకుండా పోయింది.

సుమారు నాలుగున్నర లక్షల విలువైన పశువుల మృతితో సాయిబాబా కుటుంబం శోక సంద్రంతో మునిగిపోయింది. జరిగిన ఘటన పశు సంవర్ధక శాఖ జేడీ దృష్టికి తీసుకు వెళ్లినట్లు కొయ్యలగూడెం పశువైద్య శాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సాయిబాబా కుటుంబాన్ని ఆదుకోవడానికి కలెక్టర్ కృషి చేయాలని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి కోరారు. సాయిబాబా కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.విష్ణుమూర్తి పరామర్శించి బాధిత కుటుంబానికి న్యాయం చేయడానికి కృషి చేయాల్సిందిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కోరారు.

నేటి నుంచి సురభి నాటికలు



కోలమూరులో నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలు

ఉండి: మండలంలోని కోలమూరు సంతాన గోపాలస్వామి ఆలయ ఆధ్వర్యంలో 20వ తేదీ సోమవారం నుంచి 23వ తేదీ గురువారం వరకు వినాయక నాట్య మండలి (సురభి) థియేటర్ హైదరాబాద్ వారిచే పౌరాణిక, ఆధ్యాత్మిక పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు నంబూరి బదరీనారాయణ, ఆలయ కార్య నిర్వహణాధికారి ఎం.రామరాజు ఆదివారం తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం ఏడు గంటలకు నాటక ప్రదర్శన ప్రారంభమవుతుందని దీనిలో భాగంగా ఈ నెల 20వ తేదీ సోమవారం మాయాబజార్, 21వ తేదీ శ్రీకృష్ణ లీలలు, 22వ తేదీ లవకుశ, చివరి రోజు అనగా 23వ తేదీ శ్రీనివాస కల్యాణం నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు వారు తెలిపారు. టీటీడీ, హిందూ ధర్మ పరిషత్ సౌజన్యంతో నిర్వహించే ఈ సురభి నాటికలను తిలకించేందుకు యావత్తు ప్రజానీకం, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ



కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద బారులు తీరిన భక్తులు

కైకలూరు: పెద్దింట్లమ్మ నీ చల్లని చూపులు మాపై ప్రసరించవమ్మా.. అంటూ భక్తులు ఆర్తితో అమ్మను వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు ఆదివారం బారులు తీరారు. అనేక కుటుంబాలు వేడి నైవేద్యాలతో అమ్మకు అందించారు. సర్కారు కాల్వపై సిమెంటు వంతెన నిర్మాణం కావడంతో ప్రతీ ఆదివారం భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈవో మాట్లాడుతూ ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండనశాల, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు ప్రసాదం, గదులు, అమ్మ చిత్రాలు, విరాళాల ద్వారా రూ.98,017 ఆదాయం వచ్చిందని తెలిపారు.

గొర్రెల పెంపకంలో మెలకువలు



మండవల్లి : గొర్రె పిల్లలు ఎక్కువ బరువుతో పుట్టాలంటే, మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేలు ఉండాలి. రెండు లేక రెండున్నరేళ్లకోసారి మందలోని విత్తనపు పొట్టేలును మార్చాలి. విత్తనపు పొట్టేలును సొంత మంద నుంచి కాకుండా వేరే మంద నుంచి ఎంపిక చేసుకోవాలి.

గొర్రె పిల్లల మరణాలు తగ్గాలంటే..

గొర్రె పిల్లలు పుట్టిన వెంటనే ముక్కులో ఉన్న జిగురుని పొడి గుడ్డతో తుడిచి శ్వాస సరిగా ఆడేలా చూడాలి. సరిపడా జున్ను పాలు పట్టాలి. దీని వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి జబ్బులను తట్టుకుంటుంది. పిల్లలకు మూడు నెలల వయసులో పారుడు, మశూచి వ్యాధులకు టీకాలు వేయించాలి. పిల్ల పుట్టిన 10 రోజులకు, 3 నెలలకు నట్టల నివారణ మందు తాగించాలి. పిల్లలకు రాత్రి వేళల్లో చలి గాలులు, వర్షాల నుంచి రక్షణ ఏర్పాట్లు చేయాలి.

గొర్రెలలో ఈసుకు పోవడం నివారణకు..

విత్తనపు పొట్టేలుకు ప్రతి 6 నెలకోసారి రక్త పరీక్ష చేయించాలి. చూడి గొర్రెలను మంద నుంచి వేరు చేసి పోషించాలి. చూడి గొర్రెలకు విషపూరిత (క్రిమి సంహారక మందులు వాడిన) గడ్డి మేపరాదు. కలుషిత నీరు తాగించరాదు.

జీవాలు ప్రతి రోజు 4, 5 కిలో మీటర్లు నడవడం వల్ల మేత ద్వారా లభించే శక్తి కన్నా అవి నడవడానికి ఎక్కువ శక్తి అవసరమై త్వరగా నీరసపడిపోతాయి. జీవాలను సాయంత్రం వేళ పాకలలో ఉంచి దాణా నీరు అందించడం వల్ల త్వరగా ఎదిగి బరువు తూగుతాయి. వ్యాధుల బెడద తగ్గి పునరుత్పత్తి ప్రమాణాలు పెరుగుతాయి.

పాతకక్షల నేపథ్యంలోనే హత్య



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

కైకలూరు: పాతకక్షల నేపథ్యంలోనే కలిదిండి మండలం సంతోషపురం మాజీ సర్పంచ్ కాల్వ నల్లయ్య(58) హత్య జరిగిందని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. సర్కిల్ కార్యాలయంలో సీఐ వి.రవికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన ఆదివారం వివరాలు వెల్లడించారు. హతుడు కాల్వ నల్లయ్య సంతోషపురంలో 15 ఎకరాల ఆక్వా చేపల చెరువు సాగు చేస్తూ, పేటకలిదిండిలో నివసిస్తున్నాడు. సంతోషపురం గ్రామానికి రెండు సార్లు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడిగా పనిచేశారు. సంతోషపురంలో నల్లయ్య సామాజికవర్గానికి చెందిన బొదనపు శ్రీనివాసరావు తన కుమారుడి ఆత్మహత్యకు కారణం నల్లయ్య అని కక్ష పెంచుకున్నాడు. చేపల చెరువుల సరిహద్దు బోదె నీటి విషయంలో హత్యకు మూడు రోజులు ముందు ఇద్దరికీ ఘర్షణ జరిగింది. దీంతో శ్రీనివాసరావు ముందుగానే రెక్కీ నిర్వహించి భోగేశ్వరం మలుపు తిరిగే వద్ద ఆక్వా మేతలకు ఉపయోగించే ఇనుప రాడ్డును దాచాడు. అతని వాహనంలో కమ్మ కత్తి ఉంచుకుని 16వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు శ్రీనివాసరావు నల్లయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. సిద్ధంగా ఉంచుకున్న ఇనుపరాడ్డుతో నల్లయ్య తలపై కొట్టి, వెంట తీసుకొచ్చిన కత్తితో తలపై నరికి పరారయ్యాడు. ముందుగా అందరూ రోడ్డు ప్రమాదంగా భావించి కలిదిండిలో నల్లయ్యకు ప్రథమ చికిత్స చేసి, భీమవరంలో ఆస్పత్రికి తీసుకువెళ్ళగా అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు మరణించాడు. హతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, సంతోషపురంలో హంతకుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

పెరిగిన ఆదాయం.. నాణ్యమైన సేవలకు అవకాశం


గూడెం ఆర్టీసీ డిపో


బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు


పార్శిల్, కొరియర్ కేంద్రం

- ప్రగతి పథంలో గూడెం ఆర్టీసీ డిపో
- లీజుకు స్థలాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు
- ప్రజలకు విస్తృత సేవలందించేందుకు సమాయత్తం
- ప్రయాణికులకు మౌలిక వసతుల కల్పనకు మార్గం సుగమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు కేంద్ర స్థానంలో ఉన్న తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో ప్రగతి మార్గంలో ముందుకు సాగుతోంది. ఆర్టీసీ డిపో ఐదున్నర ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిఉంది. బస్సులు నిలిపేందుకు, మరమ్మతులకు సంబంధించి విశాలమైన డిపో, ప్రయాణికులకు అనువైన కాంప్లెక్స్, అందుబాటులో బస్సులు, సిబ్బంది, కొన్ని కమర్షియల్ షాపులు, ఎ.ఎన్.ఎల్ పార్శిల్ సర్వీస్, విశాలమైన ఖాళీ స్థలాలు ఉండేవి. కాలక్రమేణ ఆర్టీసీ కమర్షియల్ ఆదాయ మార్గాలు అన్వేషణలో భాగంగా ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చారు. ఆ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు వివిధ మాల్స్ వెలిశాయి. దీంతో ఆర్టీసీ డిపో ఆవరణ రూపురేఖలు మారాయి. ఆదాయం పెరిగింది. బస్సుల నిర్వహణ వ్యయం 1 కిలోమీటర్‌కు రూ.55 ఖర్చుకాగా, డిపోకు రూ.60 ఆదాయం సమకూరుతోందని అధికారులు తెలిపారు.

ప్రయాణికుల నుంచి టికెట్ ఆదాయం

డిపోకు 10 సూపర్ లగ్జరీ బస్సులు, రెండు ఇంద్ర బస్సులు కలిపి 12 స్పెషల్ బస్సులు, 33 పల్లె వెలుగు బస్సులు, 23 అద్దె బస్సులు ఉన్నాయి. జిల్లా, ఇతర ప్రాంతాలకు వివిధ రూట్లలో బస్సులు తిరుగుతున్నాయి. వీటినుంచి రోజు వారీ రూ.8.50 లక్షల ఆదాయం సమకూరుతోంది. నెలకు రూ.2.50 కోట్లు ఆదాయం సంస్థకు సమకూరుతోంది. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, రెగ్యులర్ ఉద్యోగులు (డ్రైవర్లు, కండెక్టర్లు), అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు.

కాంప్లెక్స్‌లో మౌలిక వసతులు కల్పన

కాంప్లెక్స్‌లో ప్రయాణీకులకు అవసరమైన తాగు నీటి సౌకర్యం, కూర్చునేందుకు కుర్చీలు, ఫ్యాన్లు, లైటింగ్, టీవీలు, మైక్ అడ్రసింగ్ సిస్టమ్, మరుగుదొడ్లు, యూరినల్స్ అందుబాటులో ఉంచారు. స్కూల్, కళాశాలల విద్యార్థుల సౌకర్యార్థం వివిధ రూట్లులో ప్రత్యేక బస్సులు తిరుగుతున్నాయి. రాయితీ బస్సు పాస్‌లు ఇవ్వడం ద్వారా వారికి బస్సు సౌకర్యం కలిగిస్తున్నారు.

కమర్షియల్ ఆదాయం

ఆర్టీసీ ఆవరణలో సుమారు 70 షాపులున్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధిక షాపులు కలిగిన డిపోగా తాడేపల్లిగూడెం ప్రసిద్ధి చెందింది. 5ఏళ్లకు ఈ షాపులు లీజుకు ఇచ్చారు. వీటి ద్వారా నెలకు రూ.7.5 లక్షల ఆదాయం సమకూరుతోంది. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కె.ఎన్.రోడ్డువైపు 2 వేల చదరపు అడుగులను లీజుకు ఇచ్చారు. అదే విధంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు శశి కళాశాలకు వెళ్లే రహదారి వైపు 4 వేల చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని లీజుకు ఇవ్వడంతో వీటిద్వారా నెలకు రూ.7.5లక్షలు ఆదాయం సమకూరుతోంది. వీటన్నింటి ద్వారా అద్దెల రూపంలో నెలకు రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. మరో 300 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని ఓ మోటార్ కంపెనీకి లీజుకు ఇచ్చారు. దీని నుంచి నెలకు రూ.90 వేలు ఆదాయం సమకూరుతోంది.

తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోకు ఆదాయ మార్గాలు

- వాడపల్లి ఆలయానికి బస్సుల ద్వారా నెలకు రూ.1.60 లక్షలు
- లీజు/అద్దెల రూపంలో నెలకు రూ.15.90 లక్షలు
- బస్సులు తిప్పడం ద్వారా నెలకు రూ.2.50 కోట్లు
- కార్గో సేవల ద్వారా సంవత్సరానికి రూ.1.44 కోట్లు

కార్గో సేవల్లో భేష్

ఆర్టీసీ గూడెం డిపోనకు సంబంధించి ఎ.ఎన్.ఎల్ పార్శిల్ సర్వీస్ 2017 వరకు పనిచేయగా, అనంతర కాలంలో ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకునే క్రమంలో కొరియర్, పార్శిల్ సర్వీస్‌లను స్వయంగా ఆర్టీసీ నిర్వహిస్తుంది. 2022లో డోర్ డెలివరీని విస్తృతం చేయడంతో సంవత్సరానికి రూ.1.44 కోట్ల ఆదాయం సమకూరుతోంది. దీంతో నష్టాలు తగ్గాయి. ప్రజల నుంచి ఆదరణ లభించింది. దీంతో ఈ రంగంలో ఆర్టీసీ కార్గోను మరింత విస్తరించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

తీర్థయాత్రలకు సర్వీసులు

రెవెన్యూ (ఆదాయం) పెంచే మార్గంలో భాగంగా విహార యాత్రలు, ఆలయాల దర్శనం, టూరిజం పేరుతో మరిన్ని బస్సులను నడుపుతూ ఆదాయాన్ని పెంచే క్రమంలో సంస్థ ముందుకు సాగుతోంది. ఒక్క వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి బస్సులు తిప్పడం ద్వారా నెలకు రూ.1.60 లక్షల ఆదాయం తీసుకువస్తోంది. పబ్లిక్ డిమాండ్ ఉన్న రూట్లు భీమవరం, రావులపాలెం, ఆచంటకు సైతం అదనపు బస్సులను పెంచడంతో ఆదాయ మార్గాలు సైతం పెరిగాయి.

ఇంధన పొదుపులో ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానం

బస్సులు నిర్వహణ సక్రమంగా జరిగేందుకు డిపో గ్యారేజీలో బస్సులకు టెస్టులు, రోడ్డు టెస్టులు నిర్వహిస్తున్నారు. బస్సుల్లో లోపాలను సరిచేస్తున్నారు. ఎప్పటికప్పుడు బస్సులను పర్యవేక్షిస్తూ, మరమ్మతులు చేపడుతున్నారు. డ్రైవర్లు, కండెక్టర్ల సహాయ సహకారాలతో ఇంధన పొదుపులో భాగంగా ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఈ సంవత్సరం 5.56 కేఎంపీఎల్ తీసుకురావడం ద్వారా ప్రథమ స్థానం సాధించారు. లాభ నష్టాల పట్టికలో సైతం రాష్ట్ర వ్యాప్తంగా డిపో 9వ స్థానం సాధించింది.

సురక్షిత ప్రయాణం ఆర్టీసీకే సాధ్యం



సురక్షిత ప్రయాణం ఒక్క ఏపీఎస్ ఆర్టీసీకి సాధ్యం. ప్రజలు డిమాండ్ మేరకు అన్ని రూట్లలో సురక్షిత ప్రయాణం నిమిత్తం బస్సులు నడపుతున్నాం. అదనపు బస్సులను ప్రవేశపెడుతున్నాం. ఆర్టీసీ బస్సులను ప్రజలు తప్పక ఆదరించాలి. వివాహాది శుభ కార్యక్రమాలకు, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించేందుకు, కార్గో సేవలు అందుకునేందుకు తప్పక ఆర్టీసీని ఉపయోగించుకోవాలి.

– యేలూరి సత్యనారాయణ మూర్తి, ఆర్టీసీ డిపో మేనేజర్

క్లుప్తంగా

రహదారి భద్రత నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న డీఎస్ఎస్ నాయక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రహదారి భద్రత నియమాలు తప్పక పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డీఎస్ఎస్ నాయక్ కోరారు. ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆదివారం ఆర్టీసీ గార్యేజీలో సిబ్బందికి, డ్రైవర్లకు, కండక్టర్లు, మెకానికల్ సూపర్ వైజర్లకు రహదారిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆహార అలవాట్లు, శారీరక వ్యాయమం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ జీరో ప్రమాద లక్ష్యాన్ని సాధించే దిశగా కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

ఆకట్టుకున్న బుర్రకథ


బుర్రకథ ప్రదర్శిస్తున్న కళాకారులు

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో ఆదివారం రాత్రి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలో శ్రీలక్ష్మీ గణపతి బృందం దేవిశ్రీ పార్టీ విజయనగరం వారిచే ప్రదర్శించబడిన వెరైటీ బుర్రకథ ప్రేక్షకులను అలరించింది. అనంతరం తొమ్మిది గంటలకు ఏర్పాటు చేసిన ఉషోదయ నాట్యమండలి చెరుకుపల్లి వారిచే ప్రదర్శించబడిన మోహిని భస్మాసుర నాటకం ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉత్సవ నిర్వహకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ గోపిమూర్తి


ఆలయ ప్రాంగణంలో ఉన్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి దర్శించుకున్నారు. వీరికి ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మీనగేష్ శేష వస్త్రం ప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


సిద్ధాంతం నక్కా వారి పాలెంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం నక్కావారి పాలెంలో మావుళ్లమ్మ జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో అమ్మవారి ప్రతి రూపాలు, పల్లెటూరి అందాలు, సంక్రాంతి సందళ్లు, సనాతన ధర్మ విశిష్టత ప్రతిబింబించే విధంగా మహిళలు ముగ్గులు వేశారు. ఈ నేపథ్యంలో జాతరకు వచ్చిన భక్తులు ముగ్గులను చూసేందుకు ఉత్సాహం చూపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: పట్టణ పరిధిలోని బెల్ట్‌షాపు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న జె.ముసలయ్యనాయుడిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. నిందితుడి దగ్గర నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సైలు పి.మహేష్, జి.రఘు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

ఆకివీడు: మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి ఉచిత పశువైద్య శిబిరాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు మండల పశు వైద్యాధికారిణి భార్గవీ సత్య ఆదివారం తెలిపారు. పశువులకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గొర్రెలకు నట్టల నివారణ మందు, ఆవులు, గేదెలకు జలగ నివారణ మందు పంపిణీ చేస్తామన్నారు. పశువులకు ఇతర వ్యాధులను పరీక్షించి, తగిన మందులు, ఇంజక్షన్లు చేయనున్నట్లు తెలిపారు. గర్భకోశ వ్యాధులకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు.

దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలి



తాడేపల్లిగూడెంలో నిరసన తెలుపుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ ప్రజలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మామిడిదాన వర ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి అమిత్ షాను తొలగించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. 11 ఏళ్ల నుంచి కేంద్రంలో నరేంద్ర మోడీ, అమిత్ షా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తు, కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం చేస్తామని, అమిత్ షాను తొలగించకపోతే రానున్న రోజుల్లో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉదయరాజు, దుర్గా ప్రసాద్, నూకరాజు, లక్ష్మణరావు, శ్రీను, దుర్గారావు, గవరరాజు, అసిన్ భాష పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

ఇరగవరం: అమిత్ షా గో బ్యాక్, గో బ్యాక్ అంటూ సీపీఎం కార్యకర్తలు ఆదివారం ఇరగవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కామన మునిస్వామి మాట్లాడుతూ రాజ్యసభలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడిన అమిత్ షా పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఏపీలో అమిత్‌షా పర్యటిస్తున్నారని, రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్ళిపోవాలన్నారు. అమిత్‌షా క్షమాపణ చేప్పకపోతే త్వరలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిల్లి కోటేశ్వరరావు, గంగాధరరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజల సొమ్ముకు భద్రత కల్పించే ఆశయంతో 1956 జనవరి 19న అప్పటి పండిట్ నెహ్రూ ప్రభుత్వం, నాటి ఆర్థిక మంత్రి చింతామణి దేశ్‌ముఖ్ సారథ్యంలో జీవిత బీమాను జాతీయం చేశారని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గరికపాటి బాపయ్య శర్మ వెల్లడించారు. గడిచిన 69 ఏళ్లు కేవలం 5 కోట్లు పెట్టుబడితో ప్రారంభించిన ఎల్ఐసీ దిన దినాభివృద్ధి చెంది ప్రజల నమ్మకమే పెట్టుబడిగా, మార్కెటింగ్, సిబ్బంది కృషి ఫలితంగా నేడు రూ.55 లక్షల కోట్ల ఆస్తులతో ప్రపంచస్థాయి సంస్థగా, 40 కోట్ల ఖాతాదారులతో ఆర్థిక భద్రత కలగజేస్తుందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు రూ.లక్షల కోట్ల వనరులు సమకూర్చుతోందని చెప్పారు. బీమా ప్రీమియంపై జీఎస్టీని తొలగించి, సంస్థకు ప్రభుత్వం మరింతగా సహకరించి, అభివృద్ధి చేయాలని కోరారు.

కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.10వేలను విరాళంగా అందజేశారు. పట్టణానికి చెందిన యర్రంశెట్టి శ్రీనివాస్, ఆదిశ్రీ దంపతులు ఈ విరాళాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థినికి సైకిల్ అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికళ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సేవా కార్యక్రమంలో రూరల్ మండలం అమ్మతపురానికి చెందిన పేద విద్యార్థిని జాహ్నవి దండగర్ర స్కూల్లో చదువుతోంది. స్కూల్‌కు వెళ్లేందుకు వీలుగా ఆమెకు సైకిల్ అందజేశారు. దాతలు అవినాష్, ట్రస్టీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నా జనార్ధన్‌రావు చేతులమీదుగా సైకిల్‌ను అందించారు. మండ బ్రహ్మాజీ, టీచర్ కొమ్మన ప్రకాష్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన మిమిక్రీ ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కొబ్బరితోటలో వేంచేసియున్న శ్రీదేవి మహంకాళమ్మ తల్లి 45వ వార్షిక జాతరలో భాగంగా ఆదివారం రాత్రి ఆల్ రౌండర్ రాము మేజిక్ షో, మిమిక్రీ, మాట్లాడే బొమ్మ ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. మార్నీడి బాబ్జి, నరిసే సోమేశ్వరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పంచాయతీల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. ప్రాంతీయ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం ఆదివారం పట్టణంలోని సిపాయి పేట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు తాడేపల్లి సుబ్బరాజు అధ్యక్షత వహించారు. సోమసుందర్ మాట్లాడుతూ పంచాయతీల్లో చిరకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న కార్మికులు కృషితోనే గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు వంటి సేవలను ప్రజలకు అందుతున్నాయన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సరైన పని పరిస్థితులు, వేతనాలు, ఇతర సదుపాయాలు లేకపోవడం విచారకరమని ఆయన అన్నారు. సేవలు, ఉద్యోగం, వేతన వ్యవస్థలను క్రమబద్ధం చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓసూరి వీర్రాజు, తాడికొండ శ్రీనివాస్‌రావు, కె.లక్ష్మీనారాయణ, కళింగ లక్ష్మణరావు, భవన నిర్మాణ సంఘం నాయకులు మాట్లాడారు.

ప్రజా ప్రయోజనాలను సంరక్షించాలి


బడుగు బాలాజీ

ఉండి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలను సంరక్షించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ పత్రికా ప్రకటనలో ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ దోపిడీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నాగం పన్నుతున్నాయని తెలిపారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో రూ.10వేలకోట్లు ఇచ్చి ప్రత్యేక హోదా ఎగ్గొట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు కూడా స్టీల్‌ప్లాంట్ విషయంలో అదే ధోరణి కొనసాగిస్తుందని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రస్తుత విలువ రూ.2 లక్షలకోట్ల పైబడి ఉంటే కేంద్రంమాత్రం రూ.7686 కోట్లుగా విలువ కట్టడంలో ఆంతర్యమేమిటో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇదంతా చూస్తుంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాజేసే ఎత్తుగడలా ఉందని ఆరోపించారు. ఈక్విటీ పార్టిసిపేషన్ పేరు మీద ఎన్‌డీఏ ప్రభుత్వం ఇచ్చే రూ.10.30 వేల కోట్లు 57 శాతం వాటాగా తేల్చి తరువాతిరోజుల్లో ప్రైవేట్ కంపెనీలకు విశాఖ ఉక్కును ధారాదత్తం చేయడం కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో విశాఖ స్టీల్స్‌ను అమ్మనీయం అంటూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయడంతో దానిని నేరుగా అమ్మేందుకు అవకాశం లేక కేంద్రం ఈ విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వంతో లాలూచీకి దిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం ప్రభుత్వంతో కలిసి చంద్రబాబు దెబ్బ తీస్తున్నారని ఆరోపించారు.

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం


తాడేపల్లిగూడెం మాగంటి కల్యాణ మండపంలో ప్రసంగిస్తున్న జాన్ విక్టర్

తాడేపల్లిగూడెం రూరల్: ఏసుక్రీస్తు మార్గం విశ్వాసులకు సర్వదా అనుసరణీయమని దైవ జనులు జాన్ విక్టర్ అన్నారు. తాడేపల్లిగూడెం కడకట్ల అరారాతు ప్రార్థనా మందిరంలో పరిశుద్ధ సమాజ కూడికలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జాన్ విక్టర్ మాట్లాడుతూ పొరుగు వారి పట్ల ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, దయ, కరుణ వంటివి కనబర్చాలన్నారు. దేవుడు సూచించిన శాంతి మార్గంలో అందరూ పయనించాలని ఉద్బోధించారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తుపై విశ్వాసంతో జీవితాన్ని సాగించాలన్నారు. అనంతరం బి.జాన్సన్, బి.మైఖేల్ క్రీస్తు గీతాలను ఆలపించారు. దైవ సేవకులు బి.జాన్‌పాల్, విశ్వాసులు పాల్గొన్నారు.

96 మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు


ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షుడు వీవీఎన్ లక్ష్మీనారాయణ, దాత పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలుకు చెందిన రాజ రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ ఆసుపత్రి వైద్యులు 96 మందికి వైద్య పరీక్షలు చేశారు. 20 మందికి కళ్లజోడ్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. 10 మందిని ఆపరేషన్ల నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో వలవల బాబ్జి, చక్కా అప్పారావు, సుంకర శ్రీనివాస్, చిన్నం జగదీష్, మహాలక్ష్మి, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, గ్రంథి సత్యనారాయణ పాల్గొన్నారు.

బస్ స్టాప్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన


బస్ డిపో వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డిజైన్లను త్వరితగతిన పూర్తి చేసి అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద, ఆర్టీసీ డిపో వద్ద, బస్ స్టాప్‌ల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించారు. వీటికి సంబంధించిన డిజైన్లను రూపొందించి రానున్న రెండు రోజుల్లో అందజేయాలని మున్సిపల్ సర్వేయర్లను ఆదేశించారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా బస్టాప్ నిర్మాణ వ్యయాన్ని భీమవరం హాస్పిటల్స్ యాజమాన్యం, ఆర్టీసీ డిపో వద్ద బస్ స్టాప్ నిర్మాణానికి ఐఎంఏ నుంచి నిధులను సమకూరుస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ బోర్డ్‌లోని కళావేదిక పార్కు అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇప్పటికే రూ.10 లక్షల వ్యయాన్ని పార్కు అభివృద్ధికి రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఖర్చు చేసిందని, మరి కొన్ని కళాకృతుల ఏర్పాటుకు వెంటనే మార్కింగ్స్ ఇవ్వాలని మున్సిపల్ సర్వేయర్‌ను ఆదేశించారు. ఓల్డ్ బస్టాండ్ పునఃనిర్మాణానికి వెంటనే డిజైన్‌లను రూపొందించి నిర్మాణ దాతకు అందజేయాలని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, ఐఎంఏ ప్రతినిధి సీహెచ్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

తెలుగు గొప్పతనాన్ని చాటిన మహనీయుడు వేమన


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత కె.అచ్చిరెడ్డి

అత్తిలి: ప్రజాకవి శ్రీయోగివేమన తన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలిపి, తెలుగుభాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఆరవల్లి గ్రామంలో శ్రీయోగివేమన శత జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలను ముందు తరాల వారు చదివేలా ప్రోత్సహించాలన్నారు. వంద సంవత్సరాలుగా వేమన ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సినీ నిర్మాత కొవ్వూరి అచ్చిరెడ్డి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులతో కలిసి మహిళా కబడ్డీ పోటీల్లో మొదటి ఐదు స్థానాలు సాధించిన ఉండి, జంగారెడ్డిగూడెం, అనంతపల్లి, పీఎం లంక, తణుకు జట్లుకు, వాలీ బాల్ పోటీలలో మొదటి మూడు స్థానాలు సాధించిన కొణితివాడ, జల్లికాకినాడ, ఆరవల్లి జట్లుకు, ముగ్గుల పోటీలకు విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలగల సుస్మిత, ఎంపీటీసీ సభ్యురాలు దొమ్మేటి రమ్య, వేమన జయంతి కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, వెలగల ప్రసాదరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, కర్రి శ్రీధర్‌రెడ్డి, మోహనరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలకు మూలం బలవంతపు సంస్కరణలే

భీమవరం: ప్రజలపై బలవంతంగా రుద్దిన సంస్కరణల ఫలితమే నేడు ప్రజలకు ఎదురవుతున్న సమస్యలకు మూలమని రైతు కార్మిక సంఘాల నేతలు ధ్వజమెత్తారు. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో ఆదివారం కార్మిక, రైతు, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానాల పేరుతో తీసుకొచ్చిన సంస్కరణలు ప్రజలకు ఉపయోగపడకపోగా అనేక కష్టాలు, కడగండ్లకు గురిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలకులు దేశాన్ని నాశనం చేశారంటూ ఆరోపణలు చేసిన బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్ల గడిచిపోయినా సమస్యలు పరిష్కరించలేకపోయారని విమర్శించారు. ధరలు తగ్గించలేకపోవడం, ఉపాధి కల్పించలేకపోవడానికి కారణాలు చెప్పలేని స్థితిలో నేటి పాలకులు ఉన్నారని దుయ్యబట్టారు. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా దేశంలో అనేక పోరాటాలు చేసి, రైతులు, కార్మికుల ప్రాణాలు అర్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాల ఫలితమే జనవరి 19 కార్మిక కర్షక ఐక్యత దినం ఏర్పడిందని బాబూరావు, సత్యనారాయణ చెప్పారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు అమలు చేయడం వల్లనే జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి అధ్యక్షత వహించగా మామిడిశెట్టి రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు బి.వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, నారాయణరావు, రాము, బాబురావు పాల్గొన్నారు.